# వ్యయంలో ధనాధిపతి

పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు అంటారు. నా పుణ్యం మాత్రం పుచ్చిపోయింది.

ఈ సంసారం ఒక పసిఫిక్ మహా సముద్రం.

మునగను, తేలను.

ఊపిరాడకుండా కొట్టుకోవడమే.

నా అదృష్టం ఏమిటోకాని నరసింగరావుకూడా నన్ను క్షణం కూర్చోనివ్వడు.

"అలా కూర్చుని గున్న ఏనుగులా తయారవకపోతే, చకచక పన్లు చేసుకో కూడదూ" అన్నది అతని స్టాండర్డు డైలాగు.

సర్రున లేవబోయాను.

"తాచుపాములా తోకమీద లేస్తావే అమ్మడూ. కూర్చో. కూర్చో. నీతో మాట్లాడాలి" అని చెయ్యిపట్టుకొని కూర్చోపెట్టేరు.

అంటే ఏదో కొంపమునిగిందన్న మాటే.

కూర్చున్నాను.

"అలా ఊరికే కూర్చోకపోతే నాలుగు కథలు బరకొచ్చా డదూ? పదో పాతికో వస్తుంది" అన్నారు సిగరెట్ పొగ నా మొహం మీదికి వదుల్తూ.

బావుంది. కొత్తగా కథరాసే వాడిలా పైరెండు వాక్యాలకీ ఏమైనా సంబంధం వుందా?

ఊరికే కూర్చున్నానా?

మరే అదొక్కటే తక్కువ నా బతుక్కి.

అసలు నా బతుకే ఓ పెద్ద కథ.

ఇంతకీ వాళ్ళిచ్చే పదో, పాతికో నీకు ఓ పూట సిగరెట్ల ఖర్చుకి చాలదు.

నేను బుర్ర బద్దలు కొట్టుకొని కథలు రాస్తే నువ్వు నా మొహంమీదికి పొగ వదుల్తావా? నా తండ్రే!

అందుకే రాయను.

"ఏనుంది" లేవబోయాను.

"కొంప మునిగిపోదులే, కూర్చో, కూర్చో" మళ్ళీ కూర్చోబెట్టారు.

అసలు సంగతి చెప్పకుండా నా చేత యిలా గుంజీలు తీయించడం ఏమిటి?

అంతా నంగిరితనం!

"ఏమిటోస్మీ! ఈ వెధవ సిగరెట్లు మానలేక పోతున్నాను. హెల్త్ కోసం కాదు. జాతకంలో ఎలా రాసివుంటే అలా జరుగుతుంది. డెబ్బైఏళ్ళ ఆయుర్దాయం. సిగరెట్ల వల్ల అరవైకి దిగదు. డబ్బు. ఇటీజ కొశ్చన్ ఆఫ్ మనీ. జీతం రెండో తారీకుకే అయిపోతోంది. నాకేం అర్థం కావడం లేదు" అన్నారు, మరో సిగరెట్ అంటిస్తూ.

దేశంలో బోలెడు మంది జడ్జీలున్నారు. అందరూ ఇలాగే ఉన్నారా?

మా ఇల్లొక సత్రం. పూటా పది, పదిహేను విస్తళ్ళు లేస్తాయి. నరసింగరావు మంచివాడనిపించుకోవాలనుకుంటే తప్పదు. We have to pay the price.

నేనేం మాట్లాడలేదు. వినడవే నా అలవాటు.

అదిగో, సరిగ్గా అప్పుడే వచ్చేడు చలపతి.

"ఏంటిటి! గురూగారు. సీరియస్‌గా ఉన్నారు" అంటూ.

'శంకరా' అని ఎవరైనా ఊరికేఅన్నా శంకరుడు పొంగిపోతాట్ట.

"గురూగారూ" అంటే చాలు మా వారి ఛాతీ నలభై నుండి యాభైకి సాగుతుంది.

"రండి, రండి, అమ్మడూ కాఫీ పంపించు" అంటూ అతనికో సిగరెట్ యిచ్చేరు.

"ఒద్దు. ఇప్పుడే తాగేను" అన్నాడు చలపతి కూర్చుంటూ.

"ఎనీటైమ్ యీాజ్ కాఫీ టైమ్" అన్నారు అగ్గిపెట్టె అందిస్తూ.

నేను కాఫీ తెచ్చేసరికి ఇద్దరూ సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు.

"అయితే ఎంత పెట్టాలంటారు?" అంటున్నారు మావారు.

"అబ్బే! ఎంతండీ. జస్ట్ ఇరవై వేలు. నా ఫ్రెండు దగ్గరకొంత లాండ్ ఉంది. పెట్టుబడి లేక వదిలేశాడు కాని లేకపోతే బంగారం పండుతుంది. ఇప్పుడు పత్తిధర బాగా పలుకుతోంది. నేను దగ్గరుండి చూస్తాను." అన్నాడు చలపతి కాఫీ కప్పు అందుకుంటూ.

నాకెందుకో చలపతి అంటే అంత మంచి అభిప్రాయం లేదు. మనిషిని పొగిడి పబ్బం గడుపుకునే రకం.

ఇతనేదో కొంప కూల్చేలా ఉన్నాడు.

కూల్చనీ, నాదేం ఉంది?

మా నరసింగరావు చెప్తే వినేరకవాఁ?

"ఏంవంటావు సుందరం. మీ బాబుని ఓ పదివేలు సర్దమనకూడదూ? నాకెప్పుడూ రుమాలైనా ఇవ్వలేదు. అప్పుగానే సుమా. మరో పది ఎవరినైనా బక్కురుదాం" అన్నారు మా వారు హుషారుగా.

మా బాబుని ఛస్తే అడగను. ఎవర్ని బక్కిరినా రక్తం వస్తుందే తప్ప డబ్బురాదు.

ఒకటా! రెండా!

ఇరవై వేలు.

"పోన్లేస్తురూ. ఎందుకీ బాధలు? బండి నడుస్తోందికదా! నడవనీయండి. ఆగినప్పుడు చూద్దాం" అన్నాను.

చలపతికి తెలుసు నాకిష్టం ఉండదని.

"ఆగేక ఏం చూస్తాం మేడమ్. ఆగకుండా చూడాలికాని. ఏవంటారు గురూగారూ" అన్నాడు మావారికి 'కీ' యిస్తూ.

"ఎంతయినా ఆడదికదండీ. భయాలు, అనుమానాలు. నేనొకటి చెప్తాను వినండి. దేనికైనా కావలసింది డబ్బు కాదు సార్. కలేజా. కలేజా ఉండాలి." అన్నారు మావారు గుండె చూపిస్తూ పెద్ద వీరుడిలా.

పది నిముషాల ముందు డబ్బు ఎలాగా అని బెంగ పెట్టుకున్న మనిషేనా ఇతను?

ఏఁవిఁటో! ఈజన్మకి ఇతను నాకు అర్థం కాదు.

"ఆలోచిద్దాంలేండి" అన్నాను. తరవాత మా వారికి బ్రెయిన్ వాష్ యిద్దావని.

కాని మా వారి బ్రెయిన్ అన్‌వాషబుల్.

"నువ్వు ఏదీ నమ్మవుగాని సుందరం, నా చిన్నప్పుడు ఒక జ్యోతిష్కుడు చెప్పేడు సుమా నేను బిజినెస్ చేస్తానని. అప్పుడే మా నాన్న నన్ను బి.కాం. చదవమన్నారు. నేనే బుద్ధిలేక యీ 'లా' చదివేను. అప్పుడు గనక బి.కాం. చదివి బిజినెస్ చేసి ఉంటే యీ పాటికి బిర్లాకి బాబు అయిపోయేవాడ్ని. ఇప్పుడైనా మించిపోయేదేం లేదులే. గమ్మత్తుగాలేదూ. 'లా' చదివి జడ్జినై వ్యాపారం ప్రారంభించడం. జాతకం ఎవరూ తప్పించలేరు" అన్నారు ఆ రాత్రి సిగరెట్ పొగలో పత్తిని చూస్తూ

గమ్మత్తేవిటి శార్ధం!

ఇరవైవేలకి కాళ్ళువస్తున్నాయి.

నావల్లకాదు ఇతన్ని ఆపడం.

"ఏవిటో! నాకిష్టం లేదు. ఇరవై వేలంటే మాటలా?" సణిగేను.

"ఆడదానివి. నీకు ఈ వ్యవహారం అర్థం కాదుకాని నాకొదిలే" అన్నారు దీమాగా.

అతను నిర్ణయం తీసుకున్నాక మరి తిరుగులేదు.

ఒక దణ్ణం పెట్టేయడవేఁ.

పెట్టేశాను. పతిదేవుడే కదా!

తరవాత ఏం ఉంది?

నేను కాపరానికొచ్చిన దగ్గర్నుంచి అమ్మగా, అమ్మగా మిగిలింది బంగారు వడ్డాణం ఒక్కటే. అది బేంక్‌లోకి వెళ్ళిపోవడం, చలపతి భూమి కౌలుకి తీసుకోవడం చకచక జరిగిపోయేయి.

గురూగారూ! పత్తి మొక్కలు ఎంత ఏపుగా వస్తున్నాయి అనుకున్నారు? ఓ సారి వచ్చి చూడకూడదు? అన్నాడు చలపతి ఓ రోజు.

ఎందుక్కూడదూ?

అందులోనూ తొలి కానుపులాగ తొలిపంటాయె.

మావారు టాంకు నిండా పెట్రోలు. కారునిండా ఫ్రెండ్సూ వేసుకొని బైల్దేరారు.

నాకు సహగమనం తప్పదు.

చిన్నచిన్న నర్సరీ పిల్లలు ఆకుపచ్చని యూనిఫారం తొడుక్కొని లైన్లలో నిల్చున్నట్టున్నాయి పత్తిమొక్కలు. రవిశాస్త్రి 'పిచ్'ని పరీక్షచేస్తూ కామెంటరీ చెప్తున్నట్టు, చలపతి అక్కడక్కడ మట్టిని చేత్తో తీసి పట్టుకొని "అదిరిపోయింది సార్. పత్తికాదుసార్ బంగారం పండుతుంది" అనడం, మావారు 'ఐ సీ' అనడం.

చలపతి ఓవర్ ఏక్షన్ నాకు నచ్చదు.

కాని మా వారు తనని తిట్టినా క్షమిస్తారు కాని శిష్యపరమాణువుల్ని ఏమైనా అంటే క్షమించరు.

మరింక ఈ బాధ భరించక తప్పదు.

భూ ప్రదక్షిణం అయి వచ్చిన దగ్గర్నుంచీ మావారు పత్తికబుర్లే.

సిగరెట్ పెట్టె కొంటే చిల్లర ఎంత వస్తుందో తెలీదు మానవుడికి, కాని ఎప్పుడూ డబ్బు లెక్కలే.

లాభనష్టాల బేరీజులు.

వచ్చే ఏటికి ప్లాన్లు.

"ఏ ఏడాది వచ్చిన డబ్బు ఇంట్లో పప్పు, ఉప్పుకీ వాడద్దు. దాన్నే మళ్ళీ పెట్టుబడి పెడదాం" అన్నారు.

అయిడియా బావుంది కాని ఈ వడ్డాణం అప్పుమాటేవిఁటి?

"కొంపతీసి యిప్పుడు వడ్డాణం సింగారిస్తావా ఏవిటి! అచ్చు గంగిరెద్దులా ఉంటావు" అన్నారు పగలబడి నవ్వుతూ.

గంగిరెద్దులా ఉన్నా అమ్మవారిలా ఉన్నా చేతులూ, మెడ బోసిగా ఉండి వడ్డాణం పెట్టుకుంటే ఏం బావుంటుంది?

అయినా ఎప్పటికప్పుడు నా బుద్ధి గడ్డితింటుంది గాని, యిన్నేళ్ళ కాపురంలో యిన్ని పోగా లేనిది యిప్పుడే వడ్డాణం కోసం గింజుకోవడం ఎందుకు?

దానికెప్పుడో నేను చెంచాడు నువ్వులు వదిలేశాను.

మొత్తానికి పత్తి పంట అయిపోయింది.

"అయినా తప్పునాదేలే. నాకిప్పుడు ధనాధిపతి వ్యయంలో ఉన్నాడు. ఎవరైనా జ్యోతిష్కుడ్ని అడిగి చెయ్యాల్సింది" అంటున్న మావార్ని నేనేం చెయ్యాలి?

ఇప్పుడేవిఁటి? మాలాంటి వాళ్ళకి జీవితమంతా ధనాధిపతి వ్యయంలోనే ఉంటాడు. ఎవర్నీ అడగక్కర్లేదు.

ఇంతకీ అప్పు మేము రిటైరైన్నాటికి పిల్లల్ని పెట్టి ముప్పైవేలైంది. అప్పుడు తీర్చేం.

మరింకెప్పుడూ మా వారు వ్యాపారం, వ్యవసాయం అన్లేదు.

డబ్బుపోతే పోయింది కాని మా వారికి బుద్ధి వచ్చింది.

అంతేచాలు.

*(ఆకాశవాణి సుప్రభాతం వీక్లీ 26-10-97)*

★ ★ ★